# నూజివీడు రసాలు

— వాణిశ్రీ

ఎండలు దంచేస్తున్నాయి. పాత రోజుల్లో హైదరాబాద్‌లో ఇంతగా ఎండలు ఉండేవి కాదు. రోజులు మారిపోయాయి. బెజవాడకీ, హైదరాబాద్‌కీ పెద్ద తేడా కనిపించడంలేదు.

ఎండలో రొప్పుతూ ఆటో దిగాడు మా బాబాయి. ఆటోలో ఉన్న మామిడిపళ్ళ బుట్ట దించడంలో సాయపడ్డాను. మా బాబాయికి ఇదొక పిచ్చి. ఎండాకాలం వచ్చిందంటే, ఇక్కడికి వచ్చినప్పుడల్లా మామిడిపళ్ళ బుట్ట వెంటబెట్టుకుని వస్తాడు. అవి గూడా ఒక వారం రోజులు నిలువ ఉండే నరుకా అంటే అదీ కాదు. నూజివీడు రసాలు. రెండు రోజుల్లో బుట్ట ఖాళీ చెయ్యకపోతే డాగులు వచ్చేస్తాయి.

ఫాన్ కింద కూర్చున్నాడు మా బాబాయి.. చెమట ఆరిందే గాని, ఆయనకి ఆరాటం తగ్గలేదు.

"ఒక గది ఏ. సీ. చేయించుకోరాదూ?" అన్నాడు బాబాయి.

"ఇప్పటికే నామీద ఏడుపుగా ఉంది బాబాయ్. ఏ. సీ.లు గూడా ఎందుకు? లేనిపోని తద్దినం" అన్నాను.

"ఎవర్రా ఏడ్చేది? అయినా ఎందుకు ఏడుస్తారు?" అన్నాడు.

"గవర్నమెంటు డబ్బు అంతా నేనే తినేస్తున్నానని ఏడుపు. ఈమధ్య ఏ.సి.బి. వాళ్ళు గూడా వచ్చార్లే" అన్నాను.

ఆ మాటా, ఈ మాటా మాట్లాడుతూ "నా ఫైలు ఏమైంది? అంతులేదు" అన్నాడు.

"కమిషనర్ దగ్గరుందట. మొన్నగూడా కనుక్కున్నాను." చెప్పాడు.

"ఎన్నాళ్ళు పెట్టుకుంటాడు కమిషనర్?"

"ఏమో" అని పెదవి విరిచాను.

"ఏమిటోరా అంతా గందరగోళంగా ఉంది. పాత రోజుల్లోనే నయం. డబ్బు పారేస్తే పని చిటికెల్లో జరిగిపోయేది. పైరవీ చేసే వాళ్ళు బోలెడుమంది ఉండేవాళ్ళు. ఇప్పుడేమో అంతా మాయగా ఉంది. ఏ ఆఫీసర్ తింటాడో, ఏ ఆఫీసర్ తినడో అర్థమై చావడంలేదు. ఎవర్నయినా పట్టుకుని డబ్బిచ్చి పని చేయించుకుందామా అంటే, పని అవుతుందో లేదో తెలీదు. మొన్న పేపర్లో చూశాలే. లంచం ఇవ్వబోయాడని ఒక పెద్దమనిషిని పట్టుకున్నారటగా పోలీసులు. ఎంత ఘోరం ! ఇలాగైతే ఇక దేశం బాగుపడినట్టే" అని బాబాయి గోడు వెళ్ళబోసుకున్నాడు.

నేను వింటూ కూర్చున్నాను. మా బాబాయి ఫైలు ఒక ఆఫీసులో చాలా నెలల నుంచి పెండింగ్‌లో ఉంది. అంచెలంచెలుగా జరిగి ఇప్పుడు కమిషనర్ దగ్గర నిద్రపోతోంది. దాన్ని గురించి నన్ను కాస్త వాకబు చెయ్యమని వచ్చినప్పుడల్లా చెప్పిపోతుంటాడు.

"ఇంతకీ ఈ కమిషనర్ లంచం తినే రకమేనా?" ప్రశ్నించాడు బాబాయి.

"ఏమో బాబాయ్ ! ఏమీ తెలియడంలేదు. ఎవర్ని అడిగినా మాకు తెలియడంలేదనే అంటున్నారు. వచ్చి రెండు నెలలేగా అయింది. ఆయన సంగతి ఎవరికీ అంతుపట్టడంలేదేమో? నేను ఎంక్వయిరీ చేసి చూశాను అప్పటికీ. కొందరు తినకపోవడం ఏమిటి? ఏమీ తిననివాడు బెజవాడలో మేడ, తెనాలిలో నిమ్మతోటలు ఎట్లా సంపాదించాడని అంటున్నారు. మరి కొందరేమో



'అబ్బెబ్బే అలాంటి రకం కాదు. గడ్డివామికాడ కుక్క. తను తినడు. మరొకర్ని తిననివ్వడు' అంటున్నారు. ఇంకా ఏ సంగతీ బైటపడడం లేదు." నాకు తెలిసిన సంగతులు చెప్పాను.

"మన ఫైలు బైటపడడం ఎట్లారా మరి? చావొచ్చిపడింది" అని తల పట్టుకుని కూర్చున్నాడు.

కాస్త నిమ్మకాయ రసం తాగి సేద తీరాడు మా బాబాయి.

సాయంకాలమైంది.

"అట్లా పబ్లిక్‌గార్డెన్స్‌కి పోయి కూర్చుందాం" అన్నాడు బాబాయి.

నేను స్కూటర్ మీద బాబాయిని ఎక్కించుకుని బయల్దేరాను. ఇద్దరం పబ్లిక్‌గార్డెన్స్‌లో పచ్చటి గడ్డిమీద కూర్చున్నాం.

బాబాయి మళ్ళీ ఫైలు గురించి మొదలుపెట్టాడు. అది పెండింగ్‌లో పడిపోవడంవల్ల ఎంత నష్టం వస్తున్నదో సోదాహరణంగా చెప్పాడు. నాకు వినుగ్గా ఉంది. అన్యమనస్కంగా 'ఊ' కొడుతున్నాను.

"ఒరేయ్ అబ్బాయ్ ! నువ్వే ఏదైనా ఉపాయం ఆలోచించాలిరా" అని భారం నామీదకు నెట్టాడు.

"మధ్యలో నేనేం చెయ్యను బాబాయ్? అది మా డిపార్ట్‌మెంట్ గూడా కాదు" అన్నాను.

"అయితే ఏమిటిలే ! మీరంతా ఒక తానులో గుడ్డలే. మీది బీరకాయపీచు సంబంధమే" అని ఏమేమో సామెతలు మొదలుపెట్టాడు.

"ఆ కమిషనర్ లంచగొండి అని తెలియకుండా నేనేం చెయ్యలేను బాబాయ్" అన్నాను.

"అదంతా తెలుసుకునే బాధ్యత నీదే. డబ్బు గురించి వెనుకాడే పని లేదు" అన్నాడు బాబాయి.

"సరే చూద్దాం" అన్నాను.

ఆ రోజు రాత్రి ఈ సమస్యకు విరుగుడు ఏమిటా అని ఆలోచించాను. కమిషనర్ ఎటువంటివాడో తేల్చుకోవడమే సమస్య. అది విడిపోతే పని సులభం.

** ** **

మర్నాడు ఉదయం కాఫీ తాగుతూ ఉంటే నా బుర్రలోకి మెరుపులాఒక ఆలోచన వచ్చింది. మామిడి పళ్ళ బుట్ట చూడగానే మెరిసింది అది.

"బాబాయ్! నాకు బ్రహ్మాండమైన ఆలోచన వచ్చింది" అన్నాను.

బాబాయ్ ముఖంలోకి కళ వచ్చింది.

"ఏమిట్రా?" అన్నాడు.

"నూజివీడు రసాల బుట్ట కమీషనర్ ఇంటికి తీసుకెళ్ళి ఇచ్చి ఒక దణ్ణం పెట్టు" అన్నాను.

"ఓస్..." అన్నాడు బాబాయి చప్పరిస్తూ.

"సరిగ్గా విను. మామిడి పళ్ళలో క్యాష్ బ్యాగ్ పడెయ్. "నూజివీడు రసాలు సార్! మీ కోసం తెచ్చాను. ఇక్కడ సరిగ్గా దొరకవు కదా?" అను. "ఎందుకు లెండి" అని మొఖమాట పడతాడు. "ఫరవాలేదు సార్!" అని అంటగట్టిరా. పళ్ళు, పూలు, స్వీట్ పేకెట్లు లంచం కిందికి రావులే. పుచ్చేసుకుంటాడు. ఆయన భార్య విధిగా బుట్ట చూస్తుంది. అందులో ఉన్న క్యాష్ బ్యాగ్ చూసి భర్తకు ఇస్తుంది. అదాయన జేబులో పెట్టుకుంటే నీ ఫైల్‌కి కాళ్ళొచ్చినట్టే" చెప్పాను.

"అదాయన జేబులో పెట్టుకోకుండా పోలీసులకు ఫోన్ చేసి ఫలానా పెద్ద మనిషి పళ్ళ బుట్టలో పెట్టి ఈ డబ్బు ఇచ్చాడని చెప్పి నన్ను ఇరికిస్తే?" సందేహం వెళ్ళబుచ్చాడు బాబాయ్!

"దానికి విరుగుడు ఆలోచించాను. నువ్వు వెళ్ళే ముందే పోలీస్ స్టేషన్లో రిపోర్టు రాసిచ్చి వెళ్ళు. బస్సు దిగి వస్తున్నానని చెప్పు. క్యాష్ బ్యాగ్ ఎవరో కొట్టేశారని చెప్పు. అందులో ఎంత డబ్బుందో, ఆ బ్యాగ్ ఏ రంగులో ఉందో, దాని మీద ఏ కంపెనీ అక్షరాలున్నాయో అన్నీ వివరంగా రాసివ్వు. మన ప్లాన్ బెడిసికొట్టి కమిషనర్ పోలీసులు తెలియజేస్తే - ఈ రిపోర్టు మనల్ని రక్షిస్తుంది. అయ్యయ్యో? క్యాష్ బ్యాగ్ ,పళ్ళ బుట్టలో పడిపోయింది కాబోలు. నా మతి మండ. అనవసరంగా కంగారు పడ్డాను. పోలీస్ రిపోర్టు ఇచ్చాను. కమిషనర్ గారు చాలా దొడ్డ మనిషి. హరిశ్చంద్రుడి తమ్ముడు. కాకపోతే - లంచం అని అపోహపడి పోలీసులకు చెప్పారు" అని నువ్వు ఆ గొడవలో నుంచి బైట పడొచ్చు" చెప్పాను.

నేను చెప్పింది బాబాయికి నచ్చింది.

"ఏదో ఒకటి చెయ్యకపోతే - ఎన్నాళ్ళిలా ముసుగులో గుద్దులాట. అటో, ఇటో తేల్చేసుకుంటాను ఈ రోజు" అన్నాడు బాబాయి.

"ఫరవాలేదు బాబాయ్. ఇందులో పెద్ద ప్రమాదం ఏం లేదు" అన్నాను.

"ఇటువంటి వాటికి భయపడతానా నేను? చూస్తుండు. ఇట్టే వెళ్ళి వస్తాను. నువ్వు ఈ రోజు సెలవు పెట్టి ఇంట్లో ఉండు. ఎందుకైనా మంచిది" అన్నాడు బాబాయి.

** ** ** **

పదింటికల్లా తిరిగి వచ్చాడు బాబాయి. ఆయన ముఖం తేటగా ఉంది. ఏవో సాధించిన వాడిలా ఫీలయ్యాడు.

"ఏం బాబాయ్ - అంతా సవ్యంగా జరిగిందా?" అన్నాను.

"ఆఁ... ఇప్పటి వరకు బాగానే ఉంది. కమిషనర్,పట్టి జిడ్డు ముఖంరా. 'ఎవరు నువ్వు? పళ్ళ బుట్ట ఎందుకు తెచ్చావు? ఏ ఊరు నీది?' అని యక్ష ప్రశ్నలు వేసి చంపేశాడనుకో. అన్నింటికీ జవాబులు చెప్పి మామిడి పళ్ళ బుట్ట ఇచ్చేటప్పటికి తల ప్రాణం తోకకి వచ్చింది. నాతో మాట్లాడుతూనే రోడ్డు మీదికి వెళ్ళి వచ్చాడు రెండుసార్లు. నేను పట్టించడానికి వచ్చాననుకున్నాడో ఏమిటో? మర్యాద కోసం వచ్చి కలిశానని చెప్పినా ఒకపట్టాన నమ్మి చావడే. పట్టి అనుమానం మొగుడు" చెప్పాడు బాబాయి.

"మొత్తానికి ఇచ్చి వచ్చావుగా. అంతే చాలు. సాయంకాలం లోపల ఆ బుట్ట విప్పి చూడకపోరు. అటో ఇటో తేలిపోతుంది. ఎందుకైనా మంచిది పోలీసులు వచ్చి అడిగితే ఏం చెప్పాలో ఆలోచించుకో" అన్నాను నవ్వుతూ.

"ఆలోచించేది ఏముంది నా బొంద! పోతూ, పోతూ పోలీస్ స్టేషన్లో రిపోర్టు చేశాగా? అక్కడ ఎస్. ఐ. అడిగిన ప్రశ్నలన్నీ గుర్తున్నాయి. మళ్ళీ అవేగా అడుగుతారు. ఈజీగా చెప్పేస్తాను" అన్నాడు బాబాయి నవ్వుతూ.

** ** ** **

ఏదైనా గొడవ జరుగుతుందేమోనని నాకు లోలోపల భయంగా ఉంది. బాబాయి మా ఇంట్లో బస చేస్తున్నందుకు పోలీసులు నన్ను కూడా ప్రశ్నించక మానరు. వాళ్ళొచ్చి అడిగే వాటికి ఏమి సమాధానాలు చెప్పాలో మనసులోనే రిహార్సల్స్ వేసుకుంటున్నాను.

సాయంకాలం వరకు ఏ ప్రమాదం ముంచుకు రాలేదు.

మర్నాడు బాబాయి కమీషనర్ ఆఫీసుకి వెళ్ళి ఫైలు మీద సంతకం పెట్టించుకుని విజయ గర్వంతో ఇంటికి తిరిగి వచ్చాడు. రాగానే నాకొక కాంప్లిమెంట్ పారేశాడు.

"ఒరేయ్! అబ్బాయ్! నీ బుర్ర పాదరసంరా. ఈ అణా కానీ ఉద్యోగం చేసి ఏం సంపాదిస్తావు గాని - రాజకీయాల్లో చేరిపో. బాగుపడిపోతావు."

## అంత వరకే

### డాక్టర్ సి. నారాయణరెడ్డి

[1]

ఎముక ఉనికి విరగనంత వరకే
ఇంటి ఉనికి ఒరగనంతవరకే.
గొప్పడాబులెన్ని చెప్పుకున్నా
గుండె ఉనికి చెదరనంతవరకే.

[2]

మంట విలువ ఆరనంత వరకే
ఒంటి విలువ ఊరనంతవరకే.
మేటి గద్దెలెన్ని అందుకున్నా
నోటి విలువ జారనంతవరకే.

[3]

కలల సొగసు దొరకనంతవరకే
కడలి సొగసు తొణకనంతవరకే.
చిలిపి తలపులెన్ని ఉబుకుతున్నా
సిగ్గు సొగసు పలకనంత వరకే.

[4]

పైట పరువు ఒదిగినంతవరకే
ఏటి పరువు ఉరికినంతవరకే.
ఓటిడప్పులెన్ని కొట్టుకున్నా
పాట పరువు పలికినంతవరకే.

[5]

మబ్బు పొగరు కురిసినంతవరకే
మాను పొగరు నిలిచినంతవరకే.
పై చూరుకు ఎంత అతుక్కున్నా
పదవి పొగరు నడిచినంతవరకే.

[6]

పెదవి మత్తు తాగినంతవరకే
మదిర మత్తు ఊగినంతవరకే.
తనువంతా మదం ముసురుకున్నా
ధనం మత్తు సాగినంత వరకే.